

కథా కౌముది

మగాడు

భరద్వాజ్ గొడవర్తి

వారణాసి – హరిశ్చంద్ర ఘాట్

మలయ హరిశ్చంద్ర ఘాట్ అంచున నిలబడి గమనిస్తోంది.
బూడిద అవుతున్న శరీరాలను,
బూడిదతో కడుపు నింపుకుంటున్న జీవితాలను,
బూడిద పూసుకుని బ్రతుకుతున్న మనుషులను,
బూడిదనే జ్ఞాపకాలుగా తమతో తీసుకువెళ్తున్న మనసులను.

అమ్మే కట్టెలను,
కాలే కట్టెలను,
కంటనీరు పెట్టే గుండెలను,
గుండె అలసి ఆగిన కథలను.

ముక్తి కోసం కొందరు,
భక్తి కోసం కొందరు,
భుక్తి కోసం మరికొందరు.

మరణం, జీవితం రెండూ కలిసిన సంగమంలా ఉంది ఆ చోటు.

ఇది అంతా గమనిస్తూ, అంతా జీర్ణించుకుంటూ, ఒక ఉద్వేగంతో అక్కడే అలా నిలబడిపోయింది మలయ.

మలయ తన షిమ్లా పెయింటింగ్ కాంపిటీషన్ కోసం చాలా రోజుల నుంచి ఒక ఐడియా గురించి ఆలోచిస్తోంది. ఆ పెయింటింగ్ కేవలం అందంగా మాత్రమే ఉండకుండా, ఏదో ఒక కథ చెప్పాలనే ఒక్క ఆలోచన మాత్రమే తనకు అప్పటిదాకా ఉంది.

హరిశ్చంద్ర ఘాట్ తనకు ఒక కొత్త ఆలోచనను ఇచ్చింది. రకరకాల రంగులు తొడిగి, అలసి, చివరికి ఒకే రంగుగా మారిన మనిషి కథ గురించి తాను చెప్పబోతున్నానని మలయకు అర్థమవుతోంది.

పక్కనే ఉన్న స్నేహితురాలితో ఏ భావం పంచుకోలేదు.
ఎందుకంటే మలయ తన భావాలను మాటలతో కాకుండా రంగులతో చెప్పడానికి ఇష్టపడుతుంది.

భాగమతి నది తీరం – పశుపతినాథ్ టెంపుల్ – నేపాల్

ఉద్యోగం మానేసి సరిగ్గా సంవత్సరం అవుతోంది. సూర్యకి కథ తయారుచేసుకురమ్మని ప్రొడ్యూసర్ ఇచ్చిన గడువుకి ఇంకా నెల రోజులు మాత్రమే ఉంది.

కథ ట్రావెలింగ్ మీద, స్త్రీ స్వేచ్ఛ మీద, బ్రతుకు–చావు మధ్య సాగే మనిషిలోని వైవిధ్యాలను పరిచయం చేసే కథ అన్న ఐడియా మాత్రమే ఉంది. కథనం మాత్రం కూర్చోవడం లేదు.

చాలా ఆలోచనల మధ్య, భాగమతి నది తీరాన హారతి సమయానికి కొన్ని వందల భక్తులతో పాటు కూర్చున్నాడు సూర్య. ఒక పక్క భక్తి పారవశ్యంతో వేలాది మంది మంత్రోచ్చారణలతో హారతి జరుగుతోంది.

సూర్య అది గమనిస్తూ ఎదురుగా చూశాడు.
ఒక శవం కాలుతోంది.

తన పక్కనే కూర్చున్న ఒక అమెరికన్ జాతీయుడు, పక్కన ఉన్న తన స్నేహితుడికి చూపిస్తూ,
“See, the two flames are burning bright on either bank of Bhagamathi —— one to worship and another paves the way to merge with God,”
అని గట్టిగా నవ్వుతూ తన కెమెరాలో ఆ దృశ్యాన్ని బంధించే ప్రయత్నం చేస్తున్నాడు.

సూర్య ఒక నిమిషం ఆ *two flames* దగ్గర ఆగిపోయాడు.

చుట్టూ భక్తులు భక్తి పారవశ్యంతో నాట్యం చేస్తున్నారు. సూర్య కూడా వాళ్లతో కలిసి నృత్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ అతని చూపు కాలుతున్న కట్టెలపైనే ఉంది.

తన ఊరిలో ఎవరైనా మరణిస్తే వాళ్లను సాగనంపడానికి నాట్యం చేస్తారు. ఇక్కడ తన నాట్యం వేరొకరికి ఆత్మీయ వీడుకోలుగా అనిపించింది.

తన మదిలో ఉన్న అన్ని గీతలు చెదిరిపోతున్నాయి.
కథ కదులుతోంది.

హారతి అయిపోయింది. అందరూ వెళ్లిపోయారు. సూర్య ఒక్కడే అలా కూర్చున్నాడు. ఇంకా అదే ఆలోచనలో ఉండిపోయాడు.

ఇందాక *two flames* గురించి చెప్పిన ఆ విదేశీ వ్యక్తి తన పక్కన వచ్చి కూర్చొని,
“Mate, I have been observing you for quite some time. If you don’t mind, you can share with me if you are struggling with something,” అన్నాడు.

సూర్య కొంత మొహమాటపడినా, తన స్టోరీ, డెడ్‌లైన్స్, ఇందాక హారతిలో వచ్చిన ఆలోచన గురించి పంచుకున్నాడు.

ఆ విదేశీయుడు కూడా తన ఆలోచనలను పంచుకొని, మధ్యలో ఏదో గుర్తొచ్చినట్లుగా తన బ్యాగ్ ఓపెన్ చేస్తూ,
“Before coming here, I visited Shimla. After listening to your idea, I thought this might be helpful to you. I bought this from a painter in Shimla. It is beautiful, and it will definitely help your story,” అన్నాడు.

అని బ్యాగ్‌లోంచి ఒక పెయింటింగ్ తీసి సూర్యకి ఇచ్చాడు. ట్రైన్‌కు టైం అవుతోందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

సూర్య పెయింటింగ్ చూశాడు.

బలంగా వీస్తున్న హిమాలయ పర్వత గాలులు తనని తాకుతున్నాయి. ఒక్క నిమిషం చలనం లేకుండా నిలిచిపోయాడు; కథలో మాత్రం చలనం మొదలైంది. తాను వెతుకుతున్న కథనం ఆ పెయింటింగ్‌లోనే ఉందని అతనికి అనిపించింది.

సంబరపడిపోయాడు. థ్యాంక్స్ చెప్పాలంటే ఆ విదేశీయుడి పేరు కూడా తెలియదు.

అలా సంబరంతోనే పెయింటర్ పేరు చూసాడు.

మలయ.

మలయ నివాసం

మలయ అద్దం ముందర తలెత్తి చూసింది. నుదిటిపై ఉన్న ఎర్ర స్టికర్ తీసి అద్దానికి అంటించి, ఆకు పచ్చ రంగు బొట్టు నుదిటికి పెట్టుకుంది. ఒక్క నిమిషం అద్దంలోకి చూస్తూ ఉండిపోయింది. అద్దంలో మలయ నాన్నగారు ఉద్యోగంలో అందుకున్న బహుమతులు కనిపించాయి. ఆ బహుమతులు అందుకున్నప్పుడు తీసుకున్న ఫోటోలు కనిపించాయి. ఆ ఫోటోలలో వాళ్ల అమ్మ జానకమ్మను వెతుకుతుండగా, ఒక చేతిలో గరిట, మరో చేతిలో ఫోన్ పట్టుకుని జానకమ్మ గదిలోకి వచ్చింది. ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ కూతురి పెళ్లి ఖాయమైందని, ఇవాళ కాబోయే అల్లుడిగారిని కలవబోతుందని చెప్పి ఫోన్ పెట్టేసి, మలయ దగ్గరికి వచ్చి తల మీద చెయ్యి పెట్టింది.

ఇదంతా అద్దం నుంచే గమనిస్తున్న మలయ దగ్గరికి వచ్చిన అమ్మవైపు తిరిగి చూసింది.

“టిఫిన్ తిని వెళ్లవే.”
“ఏం చేసావు ఇవాళ?”
“గోధుమ రవ్వ ఉప్మా.”
“ఆయనకు ఇష్టమా?”
“చేయాలనిపించిందా?”
“చేయాల్సి వచ్చిందా?”

“నోరు మూయివే,” అంటూ గరిటతో పాటు తల కూడా కిందకు దించుకుని వంటగదిలోకి వెళ్లిపోయింది జానకమ్మ.

మలయ అద్దం ముందర నుంచి లేచి లివింగ్ రూమ్‌లోకి నడిచింది. కుర్చీలో చేయి తల వెనక్కి పెట్టుకుని చాగంటి గారి ప్రవచనం వింటున్నాడు రాముడు. టీవీలో చాగంటి గారు, “పెళ్లి అనేది వ్యక్తిగత నిర్ణయం కాదు, కాదు, కాదు,” అన్నారు. ఆ మాట వినగానే ఆయన మలయ వైపు చూశాడు. మలయ కూడా ఆయన వైపు చూసింది. ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. వారి మధ్య నిశ్శబ్దంగా మాటల యుద్ధం నడుస్తోంది.

అలా చూస్తూ మలయ కాలికి అంటిన దుమ్ము దులుపుకుని లేచి, గుమ్మం దాటి వెళ్లబోతూ అడుగు ముందుకు వేసింది.

వంటగది నుంచి జానకమ్మ అరిచింది:
"దేవుడికి దండం పెట్టుకుని వెళ్లి రా!"

"అమ్మా, బయటికి రా ఒకసారి."

"వస్తున్నా, ఆగవే."

"తొందరగా రా."

"అబ్బా, వస్తున్నానే," అంటూ అట్లకాడతో బయటికి వచ్చింది.

మలయ గుమ్మం బయట నిలబడి లోపల ఉన్న అమ్మ కాళ్లకి దండం పెట్టింది. చిన్నగా నవ్వుతూ——

"ఇష్టకామ్యాది సిద్ధిరస్తు,"

అని చెప్పి రాముడు వైపు చూపించింది.

చాగంటి గారి ప్రోగ్రాం చూస్తూనే ఆయన కాలు మీద కాలు వేసుకున్నాడు. ఆ కాలు మలయ వైపు చూపిస్తూ ఉంది. మలయ ఒక్క నిమిషం ఆయన వైపు చూసింది. జానకమ్మ చేతిలోని గరిట లాక్కొని ఆ కాలి దగ్గర పెట్టింది.

"ఏ మలయా!
ఏంటిది?
పెద్దంతరం, చిన్నంతరం లేకుండా?" అంది జానకమ్మ.

మలయ నిశ్శబ్దంగా చూసి——

"అమ్మా, ఆ రాముడు దేవుడు. అందుకే కాలి దగ్గర పూలు పెడతారు. ఇక్కడి రాముడు మగాడు మాత్రమే. కాలి దగ్గర నువ్వు ఉండాలి... గరిట కూడా నువ్వే కదా," అని చెప్పేసి బయటికి వెళ్లిపోయింది.

మలయ అంతరంగం

మలయ లిఫ్ట్ ఎక్కింది. గ్రౌండ్ ఫ్లోర్ బటన్ నొక్కింది.

నిశ్చలంగా నిలబడింది. మెదడులో కుంచె కదులుతోంది.

ఆ కుంచె గీస్తోంది—

మగ అహంకారాన్ని,
అమ్మను అడ్డు పెట్టుకుని ఆడిన బెదిరింపుల నాటకాలని,
తన జీవితమే ఒక నాటకంగా మారిపోతుందేమోనన్న భయాన్ని,
తన కలని, తనలోని కళని చెరిపేసి పెళ్లి అనే బంధంతో తన నుదిటిపై దిద్దాలని చూస్తున్న కస్తూరిని...

కుంచె బరువై చిత్రం చెదిరిపోతుంటే—
బంధం బంధనమై తన గీతలని చెరిపేస్తుంటే—

ఒప్పుకోలేక, తప్పుకోలేక—

లోలోన మలయ మంచులాగా కరిగిపోతోంది. కానీ పైకి హిమాలయ పర్వతంలా నిశ్చలంగా నిలబడి ఉండిపోయింది.

లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆగింది.

"మలయ, కంగ్రాచ్యులేషన్స్! పెళ్లి కుదిరిందట కదా?"

అవునన్నట్లు చిన్నగా నవ్వింది.

"గుడ్, గుడ్. ఇంతకీ మీ కాబోయే వారి పేరు ఏంటి?"

"సూర్య."

సూర్య నివాసం

సూర్య అద్దం ముందర నిలబడి ఉన్నాడు. అద్దంలో ప్రతిబింబిస్తున్న అమ్మానాన్నల పెళ్లి ఫోటోను గమనిస్తున్నాడు. ఈలోగా లోపలికి వచ్చిన నాన్న చంద్రకాంత్‌ను అద్దం నుంచే గమనించాడు.

"నాన్న, ఇవాళ టిఫిన్ ఏంటి?"

“గోధుమరవ్వ ఉప్మా.”

“మీ ఆవిడ కోసం చేశావా?”

“అవునురా... చేయాల్సి వచ్చింది.”

“చేయాలనిపించింది అనొచ్చు కదా? అయినా ఎప్పుడూ అమ్మ కోసమేనా? మా కోసం కూడా ఏమైనా చేయచ్చు కదా?”

అంటూ రూమ్ నుంచి బయటికి వస్తున్న సూర్యకు ఎదురుపడింది అమ్మ వసుమతీదేవి.

“సూర్యా, టిఫిన్ తినేసి వెళ్ళరా?”

“నాకు వద్దు అమ్మ, ఆ గోధుమరవ్వ ఉప్మా తినడం నా వల్ల కాదు.”

“మీ వారు నీ కోసం స్పెషల్‌గా చేశారు, నువ్వే తిను.”

“సరే కానీ, కొంచెం మంచి బట్టలు వేసుకుని వెళ్లచ్చు కదా?.”

“బాగానే ఉంది కదా ఇది?”

“మొదటిసారి నిన్ను చేసుకోబోయే అమ్మాయిని కలుస్తున్నావు కదరా?”

“పర్లేదులే అమ్మ. అయినా అక్కడ ఉన్నది మలయ. ఇవేమీ పట్టించుకోదు.”

“నీకు తెలుసు మరి! అసలు ఆ అమ్మాయితో ఎప్పుడైనా మాట్లాడావా? ఎన్ని సార్లు చెప్పాను, ఫోన్ చేసి ఒకసారి అయినా మాట్లాడారా అని? ఈ రోజుల్లో ఇలా ఉంటే ఎలా రా?”

“అమ్మా, అవేమీ అవసరం లేదు. మలయ నాకు బాగా నచ్చింది.”

“సరే, నాకు టైమ్ అవుతోంది. నేను వెళ్తాను. మీ ఆయన స్నానానికి వెళ్లారు. బట్టలు పెట్టాలి కదా.”

“అమ్మా, ఇంత వయసు వచ్చింది. ఇంకా ఆయనకి బట్టలు పెట్టడం ఏంటి? ఆయన తీసుకోలేడా?”

"నీకు తెలియంది కాదు కదరా! మీ నాన్నకి పని ఉంటే చాలు, ఇంకేం పట్టించుకోడు — ఏం బట్టలు వేసుకుంటున్నాం, చేసే పనికి తగ్గట్టు బట్టలు వేసుకోవాలి, ఇలాంటివేమీ ఆయన పట్టించుకోరు. ఒట్టి పిచ్చి మా లోకం! అందుకే నేను అన్నీ దగ్గరుండి చూసుకుంటా. సరే, ఆయన సంగతి నేను చూసుకుంటా, కానీ నువ్వు వెళ్లు. టైమ్ అవుతోంది."

"సరే, వెళ్లొస్తాను."

"జాగ్రత్త నాన్నా... అమ్మాయిని అడిగానని చెప్పు."

సూర్య అంతరంగం

సూర్య లిఫ్ట్ ఎక్కాడు. గ్రౌండ్ ఫ్లోర్ బటన్ నొక్కాడు. నిశ్చలంగా నిలబడ్డాడు.

బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' పుస్తకం అంటే సూర్యకి ప్రాణం. ఆ పుస్తకంలోని ప్రధాన పాత్ర దయానిధి ఒక సందర్భంలో ఒక మాట వాడతాడు — "కారణంలేని దుఃఖం." ఆ మాట అప్పట్లో సూర్యని బలంగా ప్రభావితం చేసింది. అది వాడే సందర్భం కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాడు.

ఈ రోజు అమ్మ వసుమతీదేవి "మలయ గురించి" అడుగుతున్నప్పుడు ఆ మాట వాడాలనిపించింది. కానీ అక్కడ చెప్పలేకపోయాడు — అమ్మ నవ్వుతుందేమోనని.

కానీ ఈ క్షణం వాడాలనిపించింది. దాన్నే కొంచెం మార్చి —

"కారణంలేని ప్రేమ."

నిజమైన ప్రేమకి కారణాలు ఉండకూడదని బలంగా నమ్మే వ్యక్తి సూర్య. కారణంతో మొదలయ్యే ఏ భావోద్వేగమైనా అదే కారణంతో పల్చబడుతుందని నమ్ముతాడు.

మలయని కలవలేదు. మాట్లాడలేదు. ఒకసారి మాత్రమే చూసాడు. సోషల్ మీడియాలో ఫాలో అవుతుంటాడు — అంతే తన పరిచయం. తన గురించి మరేమీ తెలియదు. కానీ మలయంటే విపరీతమైన ప్రేమ.

"దాన్నే ఆకర్షణ అంటారు. ఎందుకంటే నువ్వు నిజానికి మలయ అందాన్ని చూసి ప్రేమించావు," అని సూర్య ప్రాణస్నేహితుడు నిషి అంటాడు.

కానీ దానికి సూర్య ఒప్పుకోడు. ఆకర్షణ కొంతకాలం ఉంటుంది. కానీ సూర్యకి అర్థమవుతోంది — ఎక్కడో లోతుల్లో తనకి తెలుస్తోంది — మలయ అనే మనిషినే తాను స్వచ్ఛంగా ప్రేమించాడని. కారణాలు అడిగితే చెప్పలేడు కానీ...

ఒక్క మాటలో చెప్పాలంటే — 'చివరికి మిగిలేది'లో దయానిధి మాటలలో —

"నాకు చంద్రుడు, నక్షత్రాలు, మేఘాలు, హిమాలయ పర్వత శిఖరం, మలయ — అందరూ సమానమే. ఇవి లేకపోతే నేను జీవించలేను. వీటిని వాంఛించను... ప్రేమిస్తాను."

లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆగింది.

"సూర్య, కంగ్రాచ్యులేషన్స్! పెళ్లి కుదిరిందట కదా?"

అవునన్నట్లు పెద్దగా నవ్వాడు సూర్య.

"గుడ్, గుడ్. ఇంతకీ మీ కాబోయే శ్రీమతి పేరు ఏంటి?"

"మలయ," అని చెప్పి బయటకు వెళ్లిపోయాడు.

ఆ లిఫ్ట్‌లో పలకరించిన వాళ్లు సూర్య పక్కింట్లో ఉంటారు — వరసకి అత్త, కోడళ్లు. ముందుగా లిఫ్ట్‌లో అడుగేసింది అత్త; వెంటనే ఆమె వెంట కోడలు. ఇద్దరూ ఇలా మాట్లాడుకుంటున్నారు.

"ఆ కుర్రాడి మొహం మీద నవ్వు తప్ప వేరే భావం ఎన్నడూ చూడలేదు. బలే మంచి కుర్రాడులే... నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు," అంది అత్త.

"మగవాళ్లని నమ్మకూడదు అత్తయ్య... ముఖ్యంగా మంచి ముసుగు వేసుకున్న మగాళ్లని."

"ఇప్పుడు నా కొడుకు మీద ఎందుకు పడతావు?"

"మీ కొడుకు మంచివాడా?"

మొదటి పరిచయం

సమయం సుమారు పదకొండు గంటలు కావస్తోంది. ఇనార్బిట్ మాల్ ఫుడ్ కోర్ట్ ఎరుపు, ఆకుపచ్చ రంగుల కుర్చీలతో అమర్చబడి ఉంది. ఒక ఎరుపు రంగు కుర్చీలో మలయ కూర్చుంది. ఎదురుగా ఖాళీగా ఉన్న ఆకుపచ్చ కుర్చీ సూర్య కోసం ఎదురుచూస్తోంది.

మలయ ఏదో ఆలోచిస్తూ ఎస్కలేటర్ వైపు చూస్తోంది. కింద నుంచి ఎస్కలేటర్ ఎక్కుతూ వస్తున్న జనాన్ని గమనిస్తోంది. అలా చూస్తుండగా ఒక దంపతులు ఎస్కలేటర్ ఎక్కుతూ వస్తున్నారు. భర్త చేతిలో చిన్న పాప, మరో చేతిలో షాపింగ్ కవర్లు; భార్య భుజాన బ్యాగ్. ఆ దృశ్యం చూసి మలయ చిన్నగా నవ్వుకుంది.

వాళ్ల వెనక ఎస్కలేటర్‌పై నడుస్తూ సూర్య కనిపించాడు. పైకి వచ్చాక క్షణం చుట్టూ చూశాడు. మలయ ముందుగా చెయ్యి ఊపింది. సూర్య కూడా చెయ్యి ఊపాడు. నెమ్మదిగా వచ్చి ఆకుపచ్చ కుర్చీని వెనక్కి జరిపి కూర్చున్నాడు.

ఇద్దరూ ఒకరిని ఒకరు చూసి నవ్వుకున్నారు. ఇద్దరి మధ్య క్షణం నిశ్శబ్దం.

"ఎస్కలేటర్ మీద నడుస్తూ ఎక్కరేంటి?" మలయ అడిగింది.

వాచ్ చూపిస్తూ సూర్య అన్నాడు, "స్టెప్ కౌంట్."

"ఓహో," అంటూ మలయ నవ్వేసింది.
"టీ తాగుతారా?"

"లేదండి, జ్యూస్ తాగుతాను. ఇక్కడ రైట్ కార్నర్‌లో ఆరెంజ్ జ్యూస్ చాలా బాగుంటుంది."

"టీ కూడా బాగుంటుంది..."

"నేను ఆరెంజ్ జ్యూస్ ప్రిఫర్ చేస్తాను," అంది మలయ.

"సరే. మీరు ఉండండి. నేను తీసుకుని వస్తాను," అని చెప్పి జ్యూస్ కౌంటర్ వైపు వెళ్లాడు. అక్కడ జ్యూస్ ఇచ్చే వ్యక్తితో ఏదో నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

మలయ ఒక్కసారి అతని వైపు చూసింది. తర్వాత చూపు తిప్పుకుంది.

అప్పుడే ఎదురుగా ఉన్న టేబుల్ దగ్గరకు ఒక వ్యక్తి రెండు ఆరెంజ్ జ్యూస్ గ్లాసులతో వచ్చాడు. ఒకటి తన పాపకి ఇచ్చి, మరోటి చేతిలో పట్టుకుని తన భార్యతో,
"ఇంకో గ్లాస్ వస్తుంది... జస్ట్ వెయిట్," అన్నాడు.

ఆ మాటలు స్పష్టంగా మలయ చెవిన పడ్డాయి.

కాసేపటికి సూర్య వచ్చాడు. చేతిలో రెండు టీ గ్లాసులు.

"ఆరెంజ్ జ్యూస్ అయిపోయిందండి... అందుకే టీ తీసుకొచ్చాను. హోప్ యూ డోంట్ మైండ్."

మలయ ఎదురుగా ఉన్న ఆరెంజ్ జ్యూస్ గ్లాస్ వైపు ఒక క్షణం చూసింది. ఏమీ అనలేదు. టీ గ్లాస్ తీసుకుని టేబుల్ మీద ఉంచింది. ఒక సిప్ తాగింది. తర్వాత చూపుడు వేలు, మధ్య వేలు సాయంతో గ్లాస్‌ను కొద్దిగా ముందుకు తోసింది.

సూర్య ఒక సిప్ వేసి,
"టీ చాలా బాగుంది కదండీ?" అన్నాడు.

మలయ ఏమీ మాట్లాడలేదు.

అంతలో సూర్య ఫోన్ మోగింది.

"అమ్మా... కలిసాను... ఇప్పుడే టీ తాగాము... అవును... గ్రీన్ అమ్మ... అవును చెప్తాను... చెప్తాను..." అంటూ మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"అమ్మ మిమ్మల్ని అడిగింది," అన్నాడు.

"ఓహో?"

"ఏదో గ్రీన్ అంటున్నారు."

"అదా, మీరు ఏ డ్రెస్ వేసుకున్నారని అడిగింది."

"కాని నేను వేసుకున్నది బ్లాక్ డ్రెస్ కదా?"

"అంటే... అమ్మకి కొంచెం చాదస్తం ఎక్కువ. బ్లాక్ అంటే మళ్లీ ఏదో ఒకటి చెప్తుంది. తనతో ఎందుకొచ్చిన గొడవని, అలా చెప్పాను."

"ఓకే... ఓకే..." మలయ తల కొంచెం సంశయంగా ఊపింది.
"ఇంకా ఏదో చెప్తా అన్నారు?"

"అదేం పెద్ద విషయం కాదు. వదిలేయండి."

"పర్లేదు. చెప్పండి."

సూర్య కాసేపు పాజ్ ఇచ్చి, కొంత మొహమాటంగా అన్నాడు.

"అమ్మ మీ ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ చూస్తూ ఉంటుంది. నా అకౌంట్ నుంచి. కొన్ని ఫోటోలు కొంచెం మోడర్న్‌గా ఉన్నాయంట. పెళ్లయాక అంత మోడర్న్‌గా ఉండకపోతే బాగుంటుందన్నది తన అభిప్రాయం."

"మోడర్న్‌గా ఉంటే ఏమైనా ప్రాబ్లమా అండి?" మలయ స్వరం కాస్త గట్టిగానే ఉంది.
"Leave about your mother. మీకు ప్రాబ్లమా?"

సూర్య కాసేపు ఆలోచించాడు.

"ప్రాబ్లమ్ అయితే లేదు. Absolutely no problem. కానీ... I am not comfortable with my wife wearing such clothes after marriage. అలా అని నేను రెస్ట్రిక్ట్ చేస్తానో, ఫోర్స్ చేస్తానో కాదు. But in future, if you ask me — 'నీకు నచ్చిందా? ఎలా ఉంది ఈ డ్రెస్?' — అని, then I will say no. నాకు నచ్చదు. But I will not force my opinion on you. That I can promise."

మలయ సూర్యని ఆపుతూ, గంభీర స్వరంతో—

"సూర్య, నా బట్టల గురించి నేను సాధారణంగా ఎవరి అభిప్రాయం అడగను. చెప్పినా తీసుకోను."

సూర్య కొంచెం నవ్వుతూ,
"ఓకే... ఓకే... చిల్. సీరియస్ అవ్వాల్సిన పని లేదు. అయినా బట్టలో స్వాతంత్ర్యం వెతుక్కోవడం ఎంత వరకు కరెక్టో నాకు తెలియదు. Let's leave this matter here. ఏమైనా తింటారా?"

"లేదండి. నేను వెళ్తాను."

"అప్పుడేనా?"

"అవును."

"అదేంటి.?"

"ఇందాక మీరు జ్యూస్ తేవడానికి వెళ్ళినప్పుడు ఫ్రెండ్ ఫోన్ చేసింది. కొంచెం అర్జెంట్ పని ఉంది."

సూర్య కాసేపు ఆమె ముఖం చూసాడు.
"ఓహ్... ఓకే."

లేచి, పది అడుగులు ముందుకు వేసి ఆగింది. మెదడులో మళ్లీ కుంచె కదులుతోంది.

మరో మగాడు...

మలయ నిర్ణయించుకుంది.

తిరిగి సూర్య దగ్గరకు వచ్చింది.

"ఒక పర్సనల్ ప్రశ్న అడగొచ్చా?"

"అడగండి."

"మీరు బయటికి వెళ్లేటప్పుడు బట్టలు మీరే ఎంచుకుంటారా? లేక మీ అమ్మగారు పెడతారా??"

"అమ్మే పెడుతుందండి," అన్నాడు సూర్య సాదాసీదాగా.

మలయ కాసేపు తల ఊపింది. చిన్న నవ్వు నవ్వింది.

"థ్యాంక్స్, సూర్య. గుడ్ బై."

బయటికి వచ్చి ఆటో ఎక్కి ఇంటికి వెళ్లిపోయింది.

మలయ నిలయం

గుమ్మంలో అడుగు పెట్టగానే అమ్మ అడిగింది, "నచ్చాడా?"

మలయ అమ్మ వైపు చూసి, "తలస్నానం చేసి చాలా రోజులు అయ్యింది, అమ్మ. వేడి నీళ్లు పెట్టు," అంది.

నాన్న మాత్రం "నచ్చాడా?" అని అడగలేదు.

"ఏమేవ్... సాయంత్రం శుభలేఖలు సెలెక్ట్ చేయాలి. కొంచెం నా బట్టలు బయట పెట్టు. స్నానం చేసి వచ్చి వెళ్తాను," అన్నాడు.

రాముడు నిశ్చయించుకున్నాడు—కూతురికి నచ్చినా, నచ్చకపోయినా పెళ్లి జరిగి తీరాలని

సూర్య నిలయం

గుమ్మంలో అడుగు పెడుతూనే అమ్మ చెప్పింది—
"మీ మామగారు ఫోన్ చేశారు. శుభలేఖలు అచ్చు వేయించమని."

సూర్య ఏమి మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాడు. కొంత ఆశ్చర్యంగా నిలిచాడు. ఆ ఆశ్చర్యం మలయ వెళ్తున్నప్పుడు అన్న మాటల గురించిందే.

ఈలోగా చంద్రకాంత్—
"వసుమతి, శుభలేఖలు సెలెక్ట్ చేయాలి. కొంచెం నా బట్టలు బయట పెట్టు. స్నానం చేసి వచ్చాక అందరం కలిసి వెళ్దాం," అన్నాడు.

సూర్య కూడా ఫ్రెష్ అయ్యి వస్తానని చెప్పి బాత్రూమ్ డోర్ తెరిచి లోపలికి వెళ్లాడు. మిరర్‌లో తనని తాను చూసుకుని ఒక్క నిమిషం ఆగిపోయాడు.

అనవసరంగా బట్టల గురించి మాట్లాడానా? కారణం లేని ప్రేమ అని అనుకున్నాను. నిజంగా అంత స్వచ్ఛమైన ప్రేమనా నాది? స్వచ్ఛమైనదైతే ఇలా బట్టల గురించి మాట్లాడేవాడినా? కానీ నేను మాట్లాడిన దాంట్లో తప్పేముంది? అక్కడ నా అభిప్రాయాన్ని ఆమె మీద రుద్దడం లేదు. కేవలం ఇది నా అభిరుచి అని చెప్పాను. అది చెప్పకపోతే నేను నన్నే మోసగించుకున్నట్లే కదా. అయినా నచ్చకపోతే వాళ్లు శుభలేఖలు అచ్చు వేయించమని ఎందుకు చెప్తారు? ఎక్కువ ఆలోచించకు...

అని మళ్లీ తనను తాను సమర్థించుకుని ఒకసారి నవ్వుకున్నాడు. అద్దం నుంచి చూపు తిప్పుకుని పక్కకు జరిగిపోయాడు.

శుభలేఖలు

సూర్య ఆఫీసులో శుభలేఖలు పంచుతున్నాడు. చాలా ఆనందంగా ఉన్నాడు. సంగీత్ ప్లాన్ల గురించి చెబుతున్నాడు. వీకెండ్‌లో సూట్ కొనడానికి చార్మినార్ వెళ్లుదామని ఫ్రెండ్స్‌కి చెప్పాడు. ఇంత ఆనందంలో ఒక ఫోన్ కాల్ వచ్చింది — మలయ నుంచి. ఒకసారి ఆఫీస్ కిందకి రమ్మని, కలవాలని చెప్పింది. మెట్లు దిగి వెంటనే కిందకి వెళ్లిపోయాడు. ఒక్క నిమిషం కూడా ఆగలేదు.

మలయని చూసాడు. ఆటో నుంచి దిగింది. ఆటోలో బ్యాగ్, ట్రాలీ ఉన్నాయి. సూర్య ముందుకు వచ్చి,

"మలయ, మీరేంటి ఇలా? మనం కలిసిన తర్వాత ఫోన్ కూడా లిఫ్ట్ చేయట్లేదు. ఏమైంది? ఏమైనా జరిగిందా?" అన్నాడు.

"ఏమీ లేదు, సూర్య. మనం కలిసి ఒక జీవితం జీవించలేము. పెళ్లి దాకా వెళ్లినా ఎక్కువ కాలం నిలబడదు. ఈ విషయం మీకు ఇంకో గంటలో మా వాళ్ల ద్వారా తెలుస్తుంది. కానీ ఎందుకో పర్సనల్‌గా మీకు చెప్పాలనిపించింది. నేను బెంగళూరు వెళ్ళిపోతున్నాను. మిమ్మల్ని చూస్తే మా నాన్న గుర్తొచ్చారు, సూర్య. నన్ను నేను మా అమ్మలా ఊహించుకోలేకపోయా," అని చెప్పేసి ఆటో ఎక్కి వెళ్లిపోయింది.

సూర్య ఏమీ మాట్లాడలేదు. ఒక్క నిమిషం కూడా అక్కడ నిలబడలేదు. నడుచుకుంటూ లిఫ్ట్ దగ్గరకి వెళ్లాడు. లిఫ్ట్ ఎక్కాడు.

"ఏంటి సూర్య, ఎప్పుడూ మెట్లు ఎక్కుతావు. ఇవాళ లిఫ్ట్ ఎక్కావే?" అని ఒక కొలీగ్ అడిగాడు.

నవ్వి ఊరుకున్నాడు. లిఫ్ట్ డోర్ మూసుకుంది. అతని పెదవులు చిన్నగా వణికాయి. ఏదో గొణిగినట్టుగా అనిపించింది. వేగంగా నడుచుకుంటూ డెస్క్ దగ్గరకి వెళ్లాడు. ల్యాప్‌టాప్ క్లోజ్ చేసి, బ్యాగ్ వేసుకుని, మేనేజర్ చూస్తున్నా ఏమీ చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. శుభలేఖలు అక్కడే మర్చిపోయాడు.

పైన శుభలేఖలో 'శుభ' అచ్చు సరిగ్గా పడలేదు.

ముసురు

సూర్య బయటకి వచ్చి బండి స్టార్ట్ చేసి గేట్ దాటి వెళ్లాడు. కొంత దూరం వెళ్లి ఒక చోట ఆపాడు. హెల్మెట్ తీసాడు. ఏమీ మాట్లాడలేదు. సూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు. కనురెప్ప దాటి తడి బయటకు రానివ్వలేదు. ఎంతసేపు అక్కడ ఉన్నాడో తనకే తెలియదు. అమ్మ ఫోన్లు ఎత్తలేదు. నాన్న ఫోన్లు ఎత్తలేదు. టైమ్ చూస్తే పదకొండు కావొస్తోంది. సూర్య బండి స్టార్ట్ చేసి ఇంటికి వెళ్లాడు.

నెమ్మదిగా బండి వరండాలో పెట్టి ఫ్రంట్ డోర్ తీసుకుని లోపలకి వెళ్లాడు. హాల్‌లో ఎవ్వరూ లేరు. డైనింగ్ టేబుల్ దగ్గరకి వెళ్లాడు. గిన్నెలో నిండుగా ఉన్న భోజనాన్ని చూశాడు. నెమ్మదిగా అమ్మా నాన్నల బెడ్‌రూమ్ దగ్గరకి వెళ్లాడు. అమ్మ కాళ్ల దగ్గర నాన్న పడుకుని ఉన్నారు. అమ్మ కాళ్లు నాన్న నొక్కుతున్నారు. నాన్న కాళ్లు అమ్మ నొక్కుతోంది. నాన్న సూర్య వైపు చూశాడు. సూర్య చిన్నగా నవ్వి "పర్లేదు" అన్నట్టు సైగ చేసి వెళ్లిపోయాడు.

టవల్ కట్టుకుని స్నానానికి వెళ్లాడు. స్నానం చేసి బయటకి వచ్చి లుంగీ, చొక్కా వేసుకుని లైట్లు ఆఫ్ చేసి పడుకున్నాడు. బాత్రూమ్ లైట్ ఆఫ్ చేయడం మర్చిపోయాడు. మళ్లీ లేచి బాత్రూమ్ దగ్గరకి వెళ్లాడు. డోర్ కొంచెం లూజ్‌గా ఉంది. గట్టిగా లాగాడు. సరిగా లాక్ కాలేదు. కొంచెం గ్యాప్ వచ్చింది. మళ్లీ లాగుతుంటే సూర్య ముఖం బాత్రూమ్ మిరర్‌లో కనిపించింది.

నెమ్మదిగా డోర్ తీసుకుని లోపలకి వెళ్లాడు. అద్దంలో తన ముఖాన్ని చూసుకున్నాడు. దుఃఖం ఒక్కసారిగా ఆగలేదు. గట్టిగా ఏడ్చేశాడు. వెంటనే సర్దిచెప్పుకున్నాడు. ముఖం కడుక్కున్నాడు. డోర్ తీయబోయి ఆగిపోయాడు. మళ్లీ వెక్కి వెక్కి ఏడ్చాడు. ఎక్కడ శబ్దం వినిపిస్తుందో అన్నట్టు గొంతు వినిపించకుండా చేతులు అడ్డుపెట్టుకున్నాడు. మళ్లీ కళ్లను తుడుచుకున్నాడు. ముఖం కడుక్కున్నాడు. బయటకి వచ్చాడు. లైట్ ఆఫ్ చేశాడు. మొత్తం చీకటి. మోస్కిటో మెషిన్ స్విచ్ ఆన్ చేశాడు. ఆ వెలుతురు మాత్రం ఉంది.

మంచం మీద పడుకున్నాడు. ఫోన్ ఆన్ చేసి 'చివరికి మిగిలేది' ఆడియోబుక్ ప్లే చేసి హెడ్‌ఫోన్స్ పెట్టుకున్నాడు. దయానిధి, రాజా మధ్య సంభాషణ జరుగుతోంది:

"కారణం లేని దుఃఖం అని మొదటే చెప్పాను. సంపూర్ణమైన ప్రేమతో హృదయం నిండినప్పుడు సగం సగం మనుషుల్ని, అసంపూర్ణమైన అనుభవాలను చూసిన వ్యక్తి దుఃఖించక చేసేదేముంది?"

ఫోన్ కట్టేశాడు. నుదిటి మీద చెయ్యి ఉంచి కళ్లను మూసుకున్నాడు.

Reckong Peo, చిట్కుల్, హిమాచల్ —— మెటర్నిటీ సెంటర్, మెటర్నిటీ వార్డ్

సూర్య కూర్చొని గమనిస్తున్నాడు——

ఏడుపు విని సంబరపడిపోయే కుటుంబ సభ్యులను,
నొప్పుల కోసం ఇంజక్షన్ చేయించుకునే అతివలను,
వణికే చేతులను,
నిరీక్షించే కళ్లను,
ప్రాణం అంచున నొప్పిని,
నొప్పితో ఆరంభమయ్యే శ్వాసలను,
శివైక్యమైన, జన్మించని జీవితాలను,
"శివ, శివ" అని రోదించే గుండెలను,
చెంప తడిమిన కంటి తడులను,
కన్ను రెప్ప వేయడం మరచిన కంటిపాపలను,
తనలో మొదలై, తనువు బయటికి వచ్చి, తనువును హత్తుకున్న ప్రాణాలను,
రంగు లేదని నొచ్చుకున్న చూపులను,
రంగులు మార్చే జాతిని తొలిసారి చూస్తున్న చూపులను——

అంతా గమనిస్తూ సూర్యకు అనిపించింది——

"ఇదే కదా గుడి అంటే! భగవంతుడి లీల, సృష్టి తెలిసే చోటు ఇదే కదా!"

అలా అనుకుంటూ గోడలను గమనించడం మొదలుపెట్టాడు. ఆ గోడలు ఏదో ఒక రంగుతో నింపబడి లేవు; గోడలంతా చిత్రాలతో నిండి ఉన్నాయి. ప్రతి చిత్రం పుట్టబోయే ప్రాణం కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరికీ ఒక ధైర్యం ఇచ్చేలా ఉంది. ప్రతి గీతలోనూ కథ ఉంది, ప్రతి గీతలోనూ జన్మ ఉంది, ప్రతి గీతలోనూ జీవితం ఉంది, ప్రతి గీతలోనూ బాధ ఉంది.

ఆ చిత్రాలు ఎవరు గీసారో సూర్యకు తెలుసు. కానీ ఎక్కడో ఆ చిత్రానికి సంబంధించిన సంతకం ఉంటుంది; దాని కోసం వెతుకుతున్నాడు. కనిపించింది—

Art by 'Malaya'.

మలయ ఆపరేషన్ థియేటర్ నుంచి బయటికి వచ్చింది.

"మగ బిడ్డ పుట్టాడు" అని చెబుతుండగా, సూర్య దూరం నుంచే గమనిస్తూ చిన్న నవ్వు పెదవులపై మెరిసింది. ఇంకొంచెం వెనక్కి నడిచాడు.

తనని దాటుకుంటూ ఒకతను మలయ వైపు నడిచాడు. అతన్ని చూడగానే మలయ ముఖంలో ఎప్పుడూ చూడని సంతోషం మెరిసింది. అతను వెళ్లి మలయ నుదిటిపై ముద్దు పెట్టి, పక్కనే నర్స్ చేతిలో ఉన్న పిల్లోడిని చేతిలోకి తీసుకుని, కంటి అంచున ఆపుకుంటున్న ఉద్వేగాన్ని మలయ వైపు చూస్తూ పంచుకున్నాడు.

ఇదంతా దూరం నుంచి చూస్తున్న సూర్య, తన చేతిలో ఉన్న పుస్తకాన్ని మలయ గదిలో పెట్టమని అక్కడ ఉన్న నర్స్‌కు కొంత డబ్బు ఇచ్చి వెళ్లిపోయాడు.

ఆ పుస్తకాన్ని నర్స్ ఆ గదిలో ఉంచింది.

ఆ ఆకుపచ్చ దుప్పటిపై మలయ కోసం ఆ పుస్తకం నిశ్శబ్దంగా ఎదురుచూస్తోంది.

ఆ పుస్తకం పేరు—

"మగాడు — Inspired by the Paintings of Malaya Vishwanathan."

★★★

COMMENTS